సాక్షి
రాజన్న సిరిసిల్ల

బుధవారం। 17 । ఏప్రిల్ । 2024



పోశవ్వతల్లికి దండం

వేములవాడ: వేములవాడలోని బద్దిపోచమ్మకు మంగళవారం భక్తులు బోనాలతో మొక్కులు చెల్లించుకున్నారు.



'అమ్మ ఆదర్శ' కమిటీలతో వసతులు

సిరిసిల్ల: అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పాఠశాలల్లో వసతులు కల్పించాలని మున్సిపల్ కమిషనర్ డి.లావణ్య సూచించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
39.0/28.0

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పడప్పుడు మేఘావృతమవుతుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం లేదు.

న్యూస్‌రీల్

ప్రతిష్టాత్మకంగా 'ఆరోగ్య మహిళ'



పోత్గల్ పీహెచ్‌సీలో పరీక్షలు చేస్తున్న సిబ్బంది

సిరిసిల్లటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'ఆరోగ్యమహిళ'ను ప్రతీవారం నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ సుమన్ మోహన్‌రావు తెలిపారు. ఈసందర్భంగా మంగళవారం ప్రకటన విడుదల చేశారు. జిల్లా వైద్యారోగ్యశాఖ చేపట్టిన 'ఆరోగ్య మహిళ' శిబిరానికి స్పందన వస్తుందన్నారు. సిరిసిల్లలోని పీఎస్‌నగర్, వేములవాడ పీపీసీ, నేరెళ్ల పీహెచ్‌సీ, తంగళ్లపల్లి పీహెచ్‌సీల్లో మహిళలకు ఉచితంగా వైద్యారోగ్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ హెల్త్‌సెంటర్లలో నిర్వహించిన ఆరోగ్య మహిళ శిబిరాల్లో ఓపీడీ(605), ఓరల్ కావిటీ(605) మొత్తం పరీక్షలు(605), బ్రెస్ట్(605), పరీక్షలు జరిపినట్లు పేర్కొన్నారు. ఇవి కాకుండా యూటీఐ(09), సూక్ష్మ పోషకాలు(30), థైరాయిడ్(00), విటమిన్ డీ(00), సీబీపి(72), మందికి పరీక్షలు నిర్వహించి వీరిలో 03 మంది పేషెంట్లను జిల్లాసుపత్రికి రెఫర్ చేసినట్లు వివరించారు. ఆయా ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ కరీంనగర్ లోక్‌సభ ప్రముఖ్‌గా వెంకటేశ్వర్‌రెడ్డి



వెంకటేశ్వర్‌రెడ్డి

ముస్తాబాద్(సిరిసిల్ల): భారతీయ జనతా పార్టీ లోక్‌సభ ప్రముఖ్‌గా ముస్తాబాద్ మాజీ జెడ్పీటీసీ మట్ట వెంకటేశ్వర్‌రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న మట్ట వెంకటేశ్వర్‌రెడ్డిని లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా కరీంనగర్ లోక్‌సభ పరిధిలో బీజేపీ ప్రముఖ్‌గా నియమించారు. సహ ప్రముక్‌గా శివరామకృష్ణను నియమించారు. తనపై నమ్మకంతో బీజేపీ ఎంపీ పరిధిలో ప్రముఖ్‌గా అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కు వెంకటేశ్వర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

21న మిడిల్ లాంగ్ డిస్టెన్స్ పోటీలు

సిరిసిల్లకల్చరల్: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడో రాష్ట్రస్థాయి మిడిల్, లాంగ్ డిస్టెన్స్ ఎంపిక పోటీలను ఈనెల 21న మినీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు చిక్కాల రామారావు, కార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్ తెలిపారు. అండర్-14 నుంచి అండర్-20 విభాగంలో జరిగే ఈ ఎంపిక పోటీలకు ఆసక్తి గల క్రీడాకారులు తహసీల్దార్ జారీచేసిన జనన ధ్రువీకరణపత్రంతో హాజరు కావాలని సూచించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను 25 మందిని ఎంపిక చేసి సూర్యాపేటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. పూర్తి వివరాలకు 79014 54456లో సంప్రదించాలని సూచించారు.

21న తెలంగాణ రన్నింగ్ పోటీలు

సిరిసిల్లటౌన్: మూడో తెలంగాణ మిడిల్, లాంగ్ డిస్టెన్స్ పరుగుపందెం పోటీలను ఈనెల 21న సిరిసిల్లలో నిర్వహిస్తున్నట్లు సెస్ చైర్మన్, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చిక్కాల రామారావు, కార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 21 నుంచి మినీస్టేడియంలో అండర్-14, 16, 18, 20 మహిళలు, పురుషులకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతిభ కనబర్చిన 25 మంది క్రీడాకారులను త్వరలో సూర్యాపేటలో జరిగే స్టేట్‌మీట్స్‌కు పంపిస్తామన్నారు. పోటీలో పాల్గొనే వారు జన్మదిన ధ్రువీకరణ కోసం పదోతరగతి సర్టిఫికెట్‌ను తీసుకురావాలని కోరారు.

హమాలీల ఉపాధి దెబ్బతీయొద్దు



కలెక్టరేట్‌కు తరలివచ్చిన కార్మికులు

సిరిసిల్లటౌన్: హమాలీల ఉపాధి దెబ్బతీయొద్దని కోరుతూ ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ ఐకేపీ, పీఏసీఎస్‌లలో నిర్ణయించిన కూలీ కంటే ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలు తక్కువ ధరకు చేస్తూ.. తమ ఉపాధి దెబ్బతీస్తున్నారన్నారు. అజ్జ వేణు, మీస లక్ష్మణ్, సోమ నాగరాజు, వేణుమాధవ్ ఉన్నారు.



తల్లి లక్ష్మి, సోదరి స్రవంతితో సాయికిరణ్



ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు సివిల్స్‌లో మెరిశారు. కరీంనగర్‌కు చెందిన సహన మొదటి ప్రయత్నంలో టార్గెట్ రీచ్‌కాగా... జిల్లాలోని వెలిచాలకు చెందిన బీడీ కార్మికురాలి కొడుకు సాయికిరణ్ రెండోప్రయత్నంలో లక్ష్యం చేరుకున్నారు.

సాయికిరణ్ 27.. సహన 739..

SUCCESS STORIES

- సివిల్స్‌లో మెరిసిన మనోళ్లు
- బీడీలు చుట్టి చదివించిన తల్లి
- పేదరికాన్ని జయించి లక్ష్యం చేరుకున్న సాయికిరణ్
- చేనేత కుటుంబం బిడ్డ కలసాకారం
- మొదటి ప్రయత్నంలోనే టార్గెట్ చేరుకున్న సహన



సహనకు స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

సాక్షిప్రతినిధి,కరీంనగర్/రామడుగు: ప్రతిభకు పేదరికం అడ్డు కానే కాదని మరోసారి రుజువైంది. తల్లిదండ్రులు కార్మికులైనా తాను కలెక్టర్ కావాలనుకున్న కలను ఎట్టకేలకు నెరవేర్చుకున్నారు.. పేదరికం కారణంగా కొలువు చేయాల్సి రావడం, కోచింగ్ తీసుకోకుండా సొంతంగానే ప్రిపేరయి రెండో ప్రయత్నంలోనే లక్ష్యం చేరుకున్నారు. సివిల్స్ ర్యాంకు సాధించి యువతకు స్ఫూర్తిగా నిలిచిన నందాల సాయికిరణ్ విజయగాథను ఆయన సోదరి, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ స్రవంతి 'సాక్షి'కి వివరించారు. సాయికిరణ్ స్వగ్రామం రామడుగు మండలంలోని వెలిచాల. తల్లిదండ్రులు లక్ష్మి-కాంతారావు, సోదరి స్రవంతి ఉన్నారు. తండ్రి చేనేత కార్మికుడు, తల్లి బీడీ కార్మికురాలిగా పని చేస్తూ పిల్లల్ని పెంచారు. కుటుంబాన్ని బాగా చూసుకునేందుకు కాంతారావు మహారాష్ట్రలోని భీవండిలో చేనేత కార్మికుడిగా పని చేశారు. సాయికిరణ్ చిన్ననాటి నుంచి చదువులో ముందుండేవారు. ఐదో తరగతి వరకు సరస్వతి పాఠశాలలో చదివారు. ఆయన ప్రతిభను గుర్తించిన ఆ పాఠశాల కరస్పాండెంట్ ఉప్పుల శ్రీనివాస్ కరీంనగర్‌లోని తేజస్విని పాఠశాలలో ఆరో తరగతిలో చేర్పించారు. 2012లో పదోతరగతి, ట్రినిటీ జూనియర్ కళాశాలలో 2014లో ఇంటర్ ఎంపీసీ పూర్తి చేశారు. ఎన్ఐటీ వరంగల్‌లో సీటు సాధించిన సాయికిరణ్ 2018లో ఇంజినీరింగ్ పూర్తి చేయడంతోనే క్యాల్‌కమ్ కంపెనీలో ఉద్యోగం సాధించారు.

తండ్రి మరణించినా.. తల్లి అండతో..

ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతుండగానే సాయికిరణ్ తండ్రి 2016లో కేన్సర్ బారిన పడి మృతిచెందారు. దీంతో తల్లి లక్ష్మి కష్టపడి బీడీలు చుట్టి, తన ఇద్దరు పిల్లలను ఉన్నత చదువులు చదివించారు. కూతురు స్రవంతి బీటెక్ పూర్తి చేసి, ఆర్‌డబ్ల్యూఎస్‌లో ఇంజినీర్‌గా ఉద్యోగం సాధించారు. ప్రస్తుతం రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలో పని చేస్తున్నారు. సాయికిరణ్ 2018 నుంచి ఉద్యోగం చేస్తూనే ఆన్‌లైన్‌లో సివిల్స్ కోచింగ్ తీసుకుంటూ పరీక్షలకు సిద్ధమయ్యారు. గతేడాది విఫలమైనా రెండోసారి ఆలిండియా 27వ ర్యాంకు సాధించారు. వీరి తల్లి లక్ష్మి ఇప్పటికీ బీడీలు చుడుతుందని గ్రామస్తులు తెలిపారు. కాగా, సివిల్స్ ర్యాంకర్ సాయికిరణ్‌ను ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు అభినందిస్తున్నారు.



ప్రత్యేకత చాటుకున్న వెలిచాల..

గత పదేళ్లుగా ఉత్తమ గ్రామపంచాయతీగా పేరు పొందిన వెలిచాలకు ఇక్కడి అభివృద్ధి పనులపై స్టడీ టూర్ చేయడానికి దేశంలోని పలు రాష్ట్రాల నుంచి పలువురు సివిల్ సర్వీస్ ప్రతినిధులు వచ్చి, వెళ్తున్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకున్న సాయికిరణ్ కష్టపడి చదివి, సివిల్స్ ర్యాంకు సాధించడంతో ఈ గ్రామం ప్రత్యేకత చాటుకుంది.



ఢిల్లీలో కోచింగ్...

కరీంనగర్‌లోని విద్యానగర్‌కు చెందిన కొలనుపాక గీత-అనిల్ దంపతుల కూతురు సహన సివిల్స్ ఫలితాల్లో 739వ ర్యాంకు సాధించారు. ఆమె స్థానిక కెన్ క్రెస్ట్ స్కూల్లో పదోతరగతి, శ్రీగాయత్రి జూనియర్ కళాశాలలో ఇంటర్, హైదరాబాద్ జేఎన్టీయూలో ఇంజినీరింగ్ పూర్తి చేశారు. తర్వాత ఢిల్లీలో యూపీఎస్సీ కోచింగ్ తీసుకున్నారు. ప్రిలిమినరీ, మెయిన్స్ ఫలితాల్లో క్వాలిఫై అయ్యాక ఢిల్లీలో పలు మాక్ ఇంటర్వ్యూలకు అటెండయ్యారు. సహన తండ్రి అనిల్ కరీంనగర్‌లో పాత్రికేయుడిగా పని చేస్తున్నారు.

స్మితా సబర్వాల్ స్ఫూర్తి..

ఉమ్మడి రాష్ట్రంలో కరీంనగర్ కలెక్టర్‌గా పని చేసిన స్మితా సబర్వాల్ తనకు స్ఫూర్తి అని సహన తెలిపారు. తాను పాఠశాలలో చదువుతున్నపుడు స్మితా మేడంలా కలెక్టర్ అవ్వాలని ఆ రోజుల్లోనే ఫిక్స్ అయ్యానని, ఆ కల నెరవేర్చుకునేందుకు తాను సివిల్స్ రాయాలని నిర్ణయించుకున్నానని పేర్కొన్నారు. దీనికి తల్లిదండ్రులు ఎంతగానో సహకరించారన్నారు. పేదలకు సేవ చేయాలన్న సంకల్పంతో ముందుకెళ్తున్నట్లు తెలిపారు.

హైదరాబాద్, గజ్వేల్ పేరిట భూదందా

- డబ్బులు వసూలు చేసి తిరిగివ్వని వైనం
- బాధితుల ఫిర్యాదుతో ఒకరి రిమాండ్
- డీఎస్పీ నాగేంద్రచారి

సిరిసిల్లక్రైం: సిటీలో భూములను తక్కువ ధరకు ఇప్పిస్తామని గ్రామీణులను బురిడి కొట్టించిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి మంగళవారం తెలిపారు. హైదరాబాద్, గజ్వేల్ పరిసర ప్రాంతాల్లో ఓపెన్‌ప్లాట్స్ తక్కువ ధరకు ఇప్పిస్తానని అమాయకుల వద్ద అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేసి వారికి రిజిస్ట్రేషన్ చేయకుండా కోనరావుపేట మండలం కొలనూరుకు చెందిన మేరుగు బాబు బెదిరింపులకు పాల్పడ్డాడు. డబ్బులు తిరిగిచెల్లించకపోగా కోనరావుపేట మండలం మామిడిపల్లికి చెందిన సాసాల పద్మ, రామన్నపేటకు చెందిన చెర్ల భూదవ్వలను ఇబ్బందులకు గురిచేశాడు. బాధితుల ఫిర్యాదుతో బాబును అదుపులోకి తీసుకొని విచారించారు. కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

పౌరహక్కులను హరిస్తున్న బీజేపీ

- చంద్ర జీవితం స్ఫూర్తిదాయకం
- రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్ శోచనీయం
- సీపీఐ జాతీయ కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి



నివాళి అర్పిస్తున్న వెంకటర్‌రెడ్డి, నాయకులు

సిరిసిల్లటౌన్: పౌరహక్కులపై బీజేపీ సర్కారు దాడి చేస్తుందని సీపీఐ జాతీయ కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. సిరిసిల్ల కార్మికభవన్‌లో మంగళవారం కామ్రేడ్ చంద్ర రాజేశ్వర్‌రావు 30వ వర్ధంతిలో పాల్గొని మాట్లాడారు. లౌకిక వ్యవస్థను కూల్చేయడానికి మోదీ సర్కారు కుట్రపూరితంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ప్రభుత్వం దేశవ్యాప్తంగా కార్పొరేట్లకు రూ.12లక్షల కోట్లు రుణాలు మాఫీ చేసిన కేంద్ర సర్కారు రైతులకు మొండిచేయి చూపడం శోచనీయమన్నారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో దోషులను శిక్షించాలని కోరారు. సీపీఐ పార్టీ పార్లమెంటు ఎన్నికల్లో ఇండియా కూటమితో కలిసి పనిచేస్తుందని స్పష్టం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, కడారి రాములు, పంతం రవి, నల్ల చంద్రమౌళి, సోమ నాగరాజు, మంద సుదర్శన్ తదితరులున్నారు.

రాజన్న సన్నిధిలో రాములోరి పెళ్లి

- నేడు అంగరంగ వైభవంగా వేడుకలు
- కిక్కిరిసిన రాజన్న గుడి
- మున్సిపల్ తరఫున పట్టువస్త్రాల సమర్పణ
- భారీగా చేరుకున్న శివపార్వతులు



ఆలయం ఎదుట బతుకమ్మ ఆడుతున్న హిజ్రాలు



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

వేములవాడ: శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం ఉదయం 11.55 గంటలకు శ్రీసీతారాముల కల్యాణోత్సవం నిర్వహించేందుకు ఆలయ అధికారులు సర్వం సిద్ధం చేశారు. మంగళవారం మధ్యాహ్నం నుంచే లక్షలాది శివపార్వతులు వేములవాడకు చేరుకుంటున్నారు. దీంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. శివపార్వతుల పూనకాలు, హిజ్రాల నృత్యాలతో వేములవాడ పట్టణం సందడిగా మారింది. కల్యాణోత్సవాన్ని భక్తులు తిలకించేందుకు వీలుగా ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు ఆలయం ముందు మెట్ల నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు షామియానాలు వేశారు. బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు చైర్మన్ చాంబర్ ముందు ఏర్పాటు చేసిన ప్రత్యేక కల్యాణ వేదికపై కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఇందుకు ఆలయ అధికారులు రూ.16 లక్షలతో భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈఈ రాజేశ్ తెలిపారు. 2 లక్షల లీటర్ల తాగునీటి ప్యాకెట్లు అందుబాటులో ఉంచారు. దాతల సహకారంతో 5వేల లీటర్ల మజ్జిగను భక్తులకు అందజేయనున్నారు. 11 చోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆటోల ద్వారా తాగునీరు సరఫరా చేయనున్నారు. ఎండవేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు కూలర్లు, భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు ప్రత్యేక బారికేడ్లు ఏర్పాటు చేశారు. ప్రసాదాల పంపిణీకి ప్రత్యేక చర్యలు చేపట్టారు. లక్షా ఇరవై వేల లడ్డూలను సిద్ధం చేసి ఉంచినట్లు ఏఈవో ప్రతాప నవీన్ తెలిపారు. డీఎస్పీ నాగేంద్రచారి ఆధ్వర్యంలో 200 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

మున్సిపల్ పక్షాన పట్టువస్త్రాలు

రాజన్న ఆలయంలో జరిగే సీతారాముల కల్యాణోత్సవానికి స్థానిక మున్సిపల్ పాలకవర్గం నుంచి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు బుధవారం ఉదయం 8 గంటలకు చైర్‌పర్సన్ కమిషనర్ అన్వేష్ అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో అందజేయనున్నారు.

వేములవాడలో వింత తంతు

రామన్న పెళ్లి రోజున రాజన్నతో వివాహమాడటం ఇక్కడో తంతు. శ్రీరామ నవమి నాడు సీతారాముల కల్యాణం మామూలే. రాజన్నను భర్తగా భావించి శివపార్వతులు, జోగినులు, హిజ్రాలు కల్యాణం చేసుకుంటుంటారు. ఇతర రాష్ట్రాలకు చెందిన లక్షలాది మంది శివపార్వతులు, జోగినులు, హిజ్రాలు తరలివచ్చి రాజన్నను వివాహమాడనున్నారు.

అలసత్వం ప్రదర్శిస్తే బ్లాక్‌లిస్ట్‌లో పెడతాం

- కలెక్టర్ అనురాగ్ జయంతి



వేములవాడలో అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

వేములవాడ: అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు అలసత్వం ప్రదర్శిస్తే బ్లాక్‌లిస్ట్‌లో పెడతామని కలెక్టర్ అనురాగ్ జయంతి హెచ్చరించారు. గుడిచెరువు అభివృద్ధి పనుల్లో భాగంగా టూరిజంశాఖ ఆధ్వర్యంలో బండ్, పార్క్‌లో కొనసాగుతున్న నిర్మాణాలను అదనపు కలెక్టర్ పూజారి గౌతమితో కలిసి మంగళవారం పరిశీలించారు. పార్ పనులను పనులు సుందరంగా, ఆకర్షణీయంగా సాంప్రదాయబద్ధంగా ఉండాలని సూచించారు. పిల్లల ఆటస్థలాలు, వాకింగ్ ఏరియా, ఓపెన్‌జిమ్ పనులన్నీ రానున్న జూన్ వరకు పూర్తి చేయాలన్నారు. సూర్య నమస్కారాలు, ఇతర విగ్రహాలకు పెయింటింగ్ పనులు కొనసాగుతున్నాయని, రంజాన్, వరుస సెలవుల కారణంగా పనులు నెమ్మదిగా జరుగుతున్నాయని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. గుడిచెరువు ఆవరణలో కొనసాగుతున్న శివార్చన వేదిక పనులు పరిశీలించారు. ఆలయ ఈవో కృష్ణప్రసాద్, ఈఈ రాజేశ్‌లను ఆదేశించారు.

చెరువులు ఆక్రమణకు గురికావద్దు

వేములవాడ పరిధిలోని చెరువులను గుర్తించి ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని, వాటికి హద్దులు పెట్టాలని రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఆర్డీవో రాజేశ్వర్, టూరిజం డీఈ విద్యాసాగర్, జేఈ జీవన్‌రెడ్డి, అర్బన్ తహసీల్దార్ మహేశ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, డీటీసీపీవో అన్సారీ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం



కొనుగోళ్లను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, డీఎస్‌వో జితేందర్‌రెడ్డి

- రైతులు వడ్లను శుద్ధి చేయాలి
- అదనంగా తూకం వేస్తే కఠిన చర్యలు
- కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

ఎక్కడి వడ్లు అక్కడే



'సాక్షి'లో సోమవారం ప్రచురితమైన కథనం

సిరిసిల్ల: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ ఎస్.ఖీమ్యానాయక్ ఆదేశించారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో జాప్యమవుతుందని, తూకంలో ఎక్కువ వడ్లను జోకుతున్నారంటూ 'ఎక్కడి వడ్లు అక్కడే' శీర్షికన 'సాక్షి'లో సోమవారం కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అదనపు కలెక్టర్ సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని బోనాల, ఎల్లారెడ్డిపేట మండలంలోని పదిర, హరిదాస్‌నగర్, వెంకటాపూర్, వీర్నపల్లి మండలం భూక్యారెడ్డితండా, బాబాయ్‌చెరువు తండాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. ఖీమ్యానాయక్ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం రైతులు తమ ధాన్యాన్ని తాలు, గడ్డి లేకుండా శుద్ధి చేయాలన్నారు. ప్రతీ బస్తాను 40.600 కిలోలు మాత్రమే తూకం వేయాలని అదనంగా తూకం వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వడ్లలో 17 తేమశాతం ఉండేలా చూసుకుని కేంద్రాలకు తరలించాలించాలని సూచించారు. ప్రభుత్వం గ్రేడ్-ఏ రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.2,203, గ్రేడ్ బీ రకానికి రూ.2,183 నిర్ణయించిందని వెల్లడించారు. దళారులకు ధాన్యం విక్రయించొద్దని కోరారు.

సాక్షి ఎఫెక్ట్..

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కల్పించిన వసతులు, రిజిస్టర్లు, తూకాలు, నూతనంగా ప్రవేశపెట్టిన ఐరిస్ విధానం, ట్యాబ్ ఎంట్రీలు పరిశీలించారు. జిల్లాలో కొనుగోళ్లను వేగవంతం చేసినట్లు అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ 'సాక్షి'కి తెలిపారు. అదనపు తూకం వేయకుండా చర్యలు తీసుకుంటున్నామని, శుద్ధి చేసి ధాన్యం తేవాలని కోరారు. డీఎస్‌వో ఎస్.జితేందర్‌రెడ్డి, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ జితేంద్రప్రసాద్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ సూచించారు. మండలంలోని వెంకటాపూర్, హరిదాస్‌నగర్, పదిర, ఎల్లారెడ్డిపేటల్లో ఏర్పాటు చేసిన ఐకేపీ కొనుగోలు కేంద్రాలను మంగళవారం పరిశీలించి, మాట్లాడారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని సూచించారు. 17 శాతం తేమ ఉండేలా వడ్లను ఆరబెట్టాలన్నారు. జిల్లా పౌరసరఫరాల అధికారి జితేందర్‌రెడ్డి, మేనేజర్ జితేంద్ర ప్రసాద్, డీపీఎం సుధారాణి, మార్కెటింగ్ ఏపీఎం శ్రీనివాస్, ఏపీఎం మల్లేశం ఉన్నారు.

వీర్నపల్లి(సిరిసిల్ల): ధాన్యం కొనుగోళ్లు వేగంగా చేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ అధికారులను ఆదేశించారు. వీర్నపల్లితో పాటు భూక్యానాయక్ తండా, బాబాయ్‌చెరువు తండాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కల్పించిన వసతులు, రిజిస్టర్లు, తూకాలు, నూతనంగా ప్రవేశపెట్టిన ఐరిస్ విధానం, ట్యాబ్ ఎంట్రీలు పరిశీలించారు. నిబంధనల ప్రకారం రైతులు తమ ధాన్యాన్ని తాలు లేకుండా తెచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు.

క్లుప్తంగా

సీఎంను కలిసిన జిల్లా కాంగ్రెస్ నేతలు



సిరిసిల్ల: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో జిల్లా కాంగ్రెస్ నేతలు మంగళవారం భేటీ అయ్యారు. హైదరాబాద్‌లో రేవంత్‌రెడ్డిని కలిసి జిల్లా అభివృద్ధి పనులపై చర్చించారు. సీఎంను కలిసిన వారిలో మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే, ఆది శ్రీనివాస్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సిరిసిల్ల కాంగ్రెస్ నాయకులు కె.కె.మహేందర్‌రెడ్డి ఉన్నారు. అంతకు ముందు జిల్లాకు చెందిన పలువురు కాంగ్రెస్ నేతలు సీఎంను కలిశారు.

వృద్ధుడి ఆత్మహత్య



బాలయ్య (ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని గూడెం గ్రామానికి చెందిన బొప్ప బాలయ్య(67) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. బాలయ్య కొంతకాలంగా కేన్సర్ వ్యాధితో బాధ పడుతున్నాడు. మందులు వాడుతున్నా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది, మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమిసంహారక మందు తాగాడు. కాసేపటికి గమనించిన కుటుంబసభ్యులు ఆయనను ఆస్పత్రికి తరలించేలోగా చనిపోయాడు. మృతుడికి భార్య పద్మ, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఆరుగురి అరెస్టు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): గంజాయి విక్రయిస్తున్న ఆరుగురిని అరెస్టు చేశామని గోదావరిఖని టూటౌన్ సీఐ రవీందర్ తెలిపారు. యైటింక్లయిన్ కాలనీ వారసంతలో ఈ నెల 15న గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. వెంటనే అక్కడికి వెళ్లి, అనుమానాస్పదంగా తిరుగుతున్న మచ్చుపేటకు చెందిన ఇరికిల్ల రఘును అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతను కొంతకాలంగా గుంటూరుపల్లికి చెందిన శివ వద్ద గంజాయి కొనుగోలు చేస్తూ యైటింక్లయిన్‌కాలనీ పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నాడు. ఈమేరకు పోలీసులు మంగళవారం గుంటూరుపల్లికి వెళ్లి, చిలుముల మధును, గోదావరిఖని విఠల్‌నగర్‌లో వినోద్ ఖన్నా, తిలక్ నగర్‌లో గుజ్జుల శివప్రసాద్, సెంటినరీకాలనీలో మంథని చైతన్య అలియాస్ బన్నీ, ఆరెల్లి సాయి రేవంత్‌లను అరెస్టు చేశారు. వారి నుంచి 1.117 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

అత్తింటివారిపై వరకట్న వేధింపుల కేసు

జమ్మికుంట(హుజూరాబాద్): అదనపు వరకట్నం తీసుకురావాలంటూ వేధిస్తున్న అత్తింటివారిపై కేసు నమోదు చేసినట్లు జమ్మికుంట టౌన్ సీఐ రవి తెలిపారు. జమ్మికుంట మండలం కోరపల్లికి చెందిన పల్లె నిఖిలను హైదరాబాద్‌కు చెందిన గోడల శివచరణ్‌కు ఇచ్చి 2022లో వివాహం చేశారు. పెళ్లి సమయంలో ఒప్పుకున్న కట్నకానుకలు ముట్టజెప్పారు. ఆరు నెలల వరకు వీరి కాపురం సవ్యంగా సాగింది. తర్వాత హైటెక్ సిటీలో ఇల్లు, రూ.80 లక్షల కట్నం అదనంగా తీసుకురావాలంటూ భర్త, అత్తామామ వేధించడంతో నిఖిల మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

‘కోడ్’ కష్టాలు ఎన్నెన్నో..

- జిల్లాలో ఆరు చెక్‌పోస్టులు
- ఎక్కడికక్కడే తనిఖీలు
- నగదు తరలించలేకపోతున్న వ్యాపారులు
- ముహూర్తాల వేళ కోడ్ బంధనాలు



ఇతను ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌కు చెందిన టెంట్‌హౌస్ నిర్వాహకుడు మాజిద్. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల కోడ్ రావడంతో నగదు తరలించడం ఇబ్బందిగా మారి వ్యాపారాలు పడిపోతున్నాయి. పెళ్లిళ్ల సీజన్‌లో వ్యాపారం బాగా నడుస్తుందనుకుంటే ఎన్నికల కోడ్ ఉండడంతో రూ.50వేలకు మించి తరలించలేక లావాదేవీలు చేయలేకపోతున్నామంటున్నాడు. టెంట్‌హౌస్‌లో పనిచేసే వారికి సైతం జీతాలు ఇవ్వలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.



ఇతను ఎల్లారెడ్డిపేటకు చెందిన శ్రీగాథ రమేశ్. బంగారు నగలు తయారు చేస్తుంటాడు. పెళ్లిళ్లు, శుభకార్యాల సీజన్‌లో బిజీగా ఉంటాడు. ఇప్పుడు ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో నగదు తరలించలేక వ్యాపారాలు పడిపోయాయంటున్నాడు. ఈనెల 24 వరకు శుభ ముహూర్తాలు ఉన్నప్పటికీ.. ఎన్నికల కోడ్‌తో పనులు సరిగ్గా లేవు.



వెంకట్రావుపల్లి చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తున్న పోలీస్ అధికారులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎన్నికల కోడ్ ఎఫెక్ట్ శుభ ముహూర్తాలపై తీవ్రంగా పడుతుంది. పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు ఎక్కువగా ఉండడం.. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో భారీ మొత్తంలో నగదు తరలించలేకపోతున్నారు. ఫలితంగా బంగారు, వస్త్ర వ్యాపారాలు పడిపోయాయి.

రూ.54,78,490 నగదు సీజ్

రాజన్నసిరిసిల్ల జిల్లాలో ఆరు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఇతర ప్రాంతాల నుంచి జిల్లాలోకి ప్రవేశించే మార్గాలలో ఈ చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి ప్రతీ వాహనాన్ని పోలీసులు తనిఖీ చేస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి జిల్లాలో రూ.54,78,490 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో వివాహాలు పెట్టుకున్న ఇళ్లల్లో కార్యక్రమాల నిర్వహణ ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. ఈక్రమంలో పెళ్లి పత్రిక మొదలుకొని బంగారునగలు, బట్టలు, ఇతర సామగ్రి కొనుగోలుకు హైదరాబాద్, కరీంనగర్ వెళ్లాలంటే పెద్ద ఎత్తున నగదు తీసుకెళ్లడం వారికి ఇబ్బందిగా మారింది. రూ.50వేలకు మించి తీసుకెళ్లడం ఇబ్బందిగా మారడంతో చెక్‌పోస్టులు దాటేందుకు జెంబేలెత్తుతున్నారు. ఓ వైపు ముహూర్తం దగ్గర పడుతుండడంతో పనులు పెండింగ్‌లో ఉంటున్నాయని ఆందోళన చెందుతున్నారు.

ఆటంకంగా ఎన్నికల కోడ్

పెళ్లిళ్ల సీజన్ దగ్గరపడుతుండడం.. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. అదే సమయంలో వివాహాది శుభకార్యాలు చేసే కుటుంబాలు కూడా ఆందోళన చెందుతున్నాయి. నగదు తరలించేందుకు పోలీసు తనిఖీలు ఉంటుండడం, ఆన్‌లైన్ లావాదేవీలు చేద్దామన్న బ్యాంక్ ఖాతాలపై నిఘా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారు. నగలు, బట్టలు కొనేందుకు సిరిసిల్ల, కామారెడ్డి, నిజామాబాద్, హైదరాబాద్, కరీంనగర్ లాంటి పట్టణాలకు వెళ్తుంటారు. ఈ మార్గాల్లో జిల్లా సరిహద్దుల్లో పోలీసులు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ప్రతీ చెక్‌పోస్టు వద్ద రాత్రింబవళ్లు పోలీసులు వాహన తనిఖీలు చేపడుతున్నారు. శుభకార్యాలతో నిమిత్తం లేకుండా రూ.50వేలకు మించి తరలిస్తే సీజ్ చేస్తుండడం ఇబ్బందిగా మారింది. పెళ్లికి అవసరమైన ఫంక్షన్ హాల్స్, ఈవెంట్స్, డెకరేషన్, బ్యాండ్, పత్రికల ప్రింటింగ్, ఫర్నీచర్ తదితరాలకు లక్షల్లో అవసరముంటాయి. నగదు రూపంలో డబ్బులు ఇస్తేనే పనులు జరుగుతాయి. ఆన్‌లైన్ బదిలీ చేయాలన్న రోజుకు రూ.లక్ష వరకు మాత్రమే అవకాశం ఉంటుంది. ఈ స్థితిలో ఏం చేయాలో తెలియడం లేదని శుభకార్యాలు నిర్వహించుకునే వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కేసులు ఇలా..

సీజ్ చేసిన నగదు	రూ.54,78,490
మద్యం కేసులు	118
సీజ్ చేసిన లీటర్లు	1166.025
సీజ్ చేసిన మద్యం విలువ	రూ.6,71,882
బైండోవర్ కేసులు	192
బైండోవర్ అయిన వారు	451
గంజాయి కేసులు	514
పట్టుకున్న పీడీఎస్ బియ్యం	4900 కిలోలు

పకడ్బందీగా కోడ్ అమలు



ఎన్నికల కోడ్‌లో ఎవరికీ మినహాయింపు లేదు. ఎన్నికల నియమావళి ప్రకారం తనిఖీలు పకడ్బందీగా అమలు చేస్తున్నాం. జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిరంతర తనిఖీలు చేపట్టాం. రూ.50వేలకు మించి నగదు, బంగారం తరలిస్తే నిబంధనల ప్రకారం సీజ్ చేస్తున్నాం. పెళ్లిళ్ల సీజన్ ఉన్నప్పటికీ ఎన్నికల నియమావళి పాటించాల్సిందే. ఎవరికీ మినహాయింపు లేదు.

– శ్రీనివాస్‌గౌడ్, సీఐ, ఎల్లారెడ్డిపేట

20 నుంచి క్రికెట్ శిక్షణ శిబిరాలు

- కరీంనగర్, గోదావరిఖని, సిరిసిల్లల్లో నిర్వహణకు హెచ్‌సీఏ పచ్చజెండా
- మే 20 వరకు శిక్షణ
- ఈ నెల 18 లోపు దరఖాస్తు చేసుకున్న వారికే అవకాశం



కరీంనగర్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కేడీసీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఆగంరావు, మురళీధర్‌రావు

కరీంనగర్ స్పోర్ట్స్: క్రికెట్.. ఈ ఆట తెలియని వారుండరు. పాఠశాలలు, కాలేజీలకు సెలవులు వస్తే చాలు ఖాళీ స్థలం ఎక్కడుంటే అక్కడ మూడు కర్రలు, లేకుంటే బండరాళ్లు ఉంచి, బ్యాట్, బాల్‌తో ఆడేస్తుంటారు. ఇంతటి క్రేజ్ ఉన్న క్రికెట్‌లో ఓనమాలు నేర్పించేందుకు హెచ్‌సీఏ, కేడీసీఏ శ్రీకారం చుట్టాయి. సుమారు ఆరేళ్ల తర్వాత క్రికెట్‌లో ఉచిత వేసవి శిక్షణ శిబిరాలను తిరిగి ప్రారంభిస్తున్నాయి. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించే ఉద్దేశంతో వీటిని నిర్వహిస్తుండగా నిష్ణాతులైన కోచ్‌లు, ట్రైనర్‌ల సమక్షంలో శిక్షణ ఇవ్వనున్నారు. కరీంనగర్, గోదావరిఖని, సిరిసిల్లల్లో శిక్షణ శిబిరాలకు హెచ్‌సీఏ పచ్చజెండా ఊపింది.

తొలిసారి బాలికలకు..

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కు అనుబంధమైన కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా క్రికెట్ శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. తొలిసారి బాలికలకు సైతం శిక్షణ ఇవ్వనున్నారు. అండర్–14, 16, 19, 23 విభాగాల్లో ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు శిక్షణనిస్తారు. ఈ నెల 20 నుంచి మే 20వ తేదీ వరకు శిబిరాలు కొనసాగనున్నాయి.

ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలి

క్రీడాకారులు తమ పేర్లను www.hycricket.org వెబ్‌సైట్‌లో ఈ నెల 18వ తేదీలోపు నమోదు చేసుకోవాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నవారికే శిక్షణకు అవకాశం ఉంటుంది. శిబిరానికి ఎంపికైన క్రీడాకారులు వైట్ యూనిఫాంతో రావాలి. మిగిలిన కిట్ మొత్తం కేడీసీఏవారు ఇస్తారు.

శిబిరాల ప్రదేశాలు..

కరీంనగర్‌లోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల ఎదురుగా ఉన్న క్రికెట్ సంఘం మైదానంలో శిక్షణ శిబిరం జరగనుంది. క్రీడాకారులు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ 80087 29397. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని జీఎం గ్రౌండ్ వేదికగా శిబిరం నిర్వహించనున్నారు. క్రీడాకారులు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ 98663 51620. సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శిక్షణనివ్వనున్నారు. క్రీడాకారులు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ 94943 62362.

తాగునీటి ఇబ్బందులు రానీయొద్దు

- ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి
- రైతుల ఖాతాల్లో వడ్ల డబ్బులు వేయాలి
- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ
- జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశం



నివేదిక సమర్పిస్తున్న పీఆర్ ఈఈ సూర్యప్రకాశ్

సిరిసిల్ల: జిల్లాలో వేసవిలో తాగునీటి ఇబ్బందులు రానీయొద్దని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ కోరారు. జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశం మంగళవారం జెడ్పీ ఆఫీస్‌లో జరిగాయి. జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ మాట్లాడుతూ జిల్లాలో భూగర్భ జలాలు ఇంకిపోయి.. నీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ముందస్తు ప్రణాళికతో నీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. మిషన్ భగీరథ నీరు జిల్లాలోని చివరి గ్రామాల వరకు చేరాలని సూచించారు. కొన్ని ప్రాంతాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఇంకా కొనడం లేదని, వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలని సూచించారు. ప్రగతిలో ఉన్న అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని, అందుబాటులో ఉన్న నిధులను వినియోగించుకోవాలని సూచించారు. జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాల్లో విద్య, వైద్యం, ప్రణాళిక, ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, నిర్మాణ పనుల స్టాండింగ్ కమిటీలకు జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ అధ్యక్షత వహించగా, వ్యవసాయంపై జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, సాంఘిక సంక్షేమంపై బోయినపల్లి జెడ్పీటీసీ కత్తెరపాక ఉమ అధ్యక్షత వహించారు. జెడ్పీ సీఈవో ఉమారాణి, జెడ్పీటీసీలు మ్యాకల రవి, గుగులోత్ కళావతి, చీటి లక్ష్మణ్‌రావు, నాగం కుమార్, గుండం నర్సయ్య, కో–ఆప్షన్ సభ్యుడు చాంద్‌పాషా, డీఏవో భాస్కర్, డీసీవో బుద్ధనాయుడు, ఉద్యాన అధికారి జ్యోతి, పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ కొమురయ్య, మత్స్యశాఖ అధికారి శివకుమార్, భూగర్భ జలాధికారి నర్సింహులు, పీఆర్ ఈఈ సూర్యప్రకాశ్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

- సరైన పత్రాలు లేని 40 బైక్‌లు స్వాధీనం
- వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి



మాట్లాడుతున్న డీఎస్పీ నాగేంద్రచారి

వేములవాడరూరల్: ప్రజల రక్షణ కోసమే పోలీస్‌శాఖ పనిచేస్తుందని వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి పేర్కొన్నారు. వేములవాడరూరల్ మండలం బొల్లారంలో డీఎస్పీ నాగేంద్రచారి ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 4 గంటల నుంచి కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి తనిఖీలు చేసి ధ్రువీకరణపత్రాలు సరిగ్గా లేని 40 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ప్రజల రక్షణ కోసమే గ్రామాల్లో కమ్యూనిటీ కాంట్రాక్టు ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలో ఎవరైనా కొత్త వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. మాదక ద్రవ్యాలు, గంజాయి వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని కోరారు. వాహనాలు నడిపే వారు వాహనాలకు సంబంధించిన పత్రాలు, డ్రైవింగ్‌లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. వేములవాడరూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై మారుతి తదితరులు పాల్గొన్నారు.

అంజన్న సన్నిధిలో తాగునీటికి ప్రాధాన్యం

- భక్తులకు ఇబ్బంది రానీయొద్దు
- సమీక్ష సమావేశంలో అడిషనల్ కలెక్టర్ దివాకర



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ దివాకర

కొండగట్టు(చొప్పదండి): ఈనెల 22 నుంచి 24 వరకు కొండగట్టు అంజన్న సన్నిధిలో జరిగే హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలని, దీక్షాపరులకు ఎట్టి పరిస్థితుల్లోనూ తాగునీటికి ఇబ్బంది రానీయొద్దని అడిషనల్ కలెక్టర్ దివాకర అధికారులను ఆదేశించారు. స్థానిక ఈవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ముఖ్యంగా తాగునీటికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. చలివేంద్రాలను రోడ్డుకిరువైపులా ఏర్పాటు చేయాలని సూచించారు. వాహనాల పార్కింగ్‌కు ఏడుచోట్ల స్థలాలు గుర్తించామన్నారు. రాత్రివేళ లైటింగ్ ఏర్పాటు చేయాలని, పాదయాత్రన వచ్చే భక్తులకు చిన్నపాటి ఇబ్బంది రానీయొద్దని పేర్కొన్నారు. మాల విరమణ, కేశ ఖండనం, కోనేరు ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు పరిశుభ్రత పాటించాలన్నారు. 100 సీసీ కెమెరాలు, రెండు అంబులెన్స్‌లు, ఆరు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. పారిశుధ్య నిర్వహణకు 380 మందిని నియమిస్తామన్నారు. కోనేరులో నీటిని ఎప్పటికప్పుడు మార్చాలని సూచించారు. పోలీస్ కంట్రోల్ రూం, మీడియాసెంటర్లు ప్రారంభించి ఎప్పటికప్పుడు భక్తులకు సమాచారం చేరవేసేలా చూడాలన్నారు. ఈవో చంద్రశేఖర్, ఏఈవో అంజయ్య పాల్గొన్నారు.

చిన్నారిని చిదిమేసిన స్కూల్ వ్యాన్

- కుమారుడిని బడికి పంపించేందుకు వెళ్లిన తల్లి
- టైర్ కింద పడి ఏడాదిన్నర చిన్నారి దుర్మరణం



రోదిస్తున్న కుటుంబ సభ్యులు



అరిబా (ఫైల్)

మల్యాల(చొప్పదండి): కుమారుడిని స్కూల్ వ్యాన్ ఎక్కించేందుకు వెళ్లిన తల్లిని వెదుక్కుంటూ వెళ్లిన చిన్నారి అదే స్కూల్ వ్యాన్ కిందపడి మృతిచెందిన సంఘటన జగిత్యాల జిల్లా మల్యాల మండలం మద్దుట్లలో చోటుచేసుకుంది. మద్దుట్లకు చెందిన ఎండీ.హసీనా, రజాక్‌కు సాజిత్ (4), కూతురు అరిబా(ఏడాదిన్నర) ఉన్నారు. సాజిత్ రామన్నపేటలోని సరస్వతి విద్యానికేతన్‌లో చదువుతున్నాడు. మంగళవారం కూతురు అరిబాను ఇంట్లో ఉంచి.. సాజిత్‌ను స్కూల్ వ్యాన్ ఎక్కించేందుకు తల్లి హసీనా వెళ్లింది. అరిబా తల్లిని వెదుకుతూ స్కూల్ వ్యాన్ వద్దకు చేరుకుంది. స్కూల్ బస్ ముందు నుంచి వెళ్లడం.. గమనించకుండా డ్రైవర్ ముందుకు కదలడంతో చిన్నారి టైర్ల కింద పడిపోయింది. తలపైనుంచి టైరు వెళ్లడంతో మెదడు చితికిపోయింది. స్థానికులు తండ్రి రజాక్‌కు సమాచారం అందించారు. వెంటనే ఆయన చిన్నారిని ఆటోలో జగిత్యాల ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు.

పది నిమిషాలు ముందు వచ్చి ఉంటే..

అరిబా తండ్రి రజాక్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజూ కూరగాయలు తీసుకొచ్చేందుకు వేకువజామునే జగిత్యాల వెళ్తాడు. వచ్చాక సాజిత్‌ను స్కూల్‌కు పంపిస్తాడు. ఎప్పటిలాగే జగిత్యాల వెళ్లిన రజాక్‌కు ఆలస్యం కావడంతో హసీనా సాజిత్‌ను వ్యాన్ ఎక్కించేందుకెళ్లింది. అంతలోనే ఘోరం జరిగింది. తాను ముందొచ్చినా కూతురు బతికేదని రజాక్ రోదించిన తీరు కలిచివేసింది.

శుభకార్యానికి వెళ్తూ మృత్యు ఒడికి..

- రోడ్డు ప్రమాదంలో గాయపడి, చికిత్స పొందుతూ యువకుడి మృతి
- కోర్టు కేసు ఉండటంతో 2 నెలల కిందటే దుబాయ్ నుంచి రాక
- నాగయ్యపల్లెలో విషాదం



సాయికుమార్ (ఫైల్)

చందుర్తి(వేములవాడ): ఓ కేసులో నిందితుడిగా ఉన్న ఓ యువకుడు దుబాయ్ నుంచి వచ్చిన 2 నెలలకే మృత్యుఒడికి చేరాడు. శుభకార్యానికి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి, చికిత్స పొందుతూ మృతిచెందాడు. బాధిత కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. వేములవాడ రూరల్ మండలంలోని నాగయ్యపల్లెకు చెందిన సెట్టుపల్లి లక్ష్మి–వెంకటేశ్ దంపతుల కుమారుడు సాయి ఉరఫ్ సాయికుమార్. రెండేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లాడు. అంతకుముందు ప్రేమ పెళ్లి చేశాడని ఇతనిపై వేములవాడ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇది కోర్టులో ట్రయల్‌కు రావడంతో సాయికుమార్ తల్లిదండ్రులు అతన్ని దుబాయ్ నుంచి రమ్మనడంతో 2 నెలల క్రితమే వచ్చాడు. సోమవారం చందుర్తి మండలం జోగాపూర్‌లోని తమ బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి బైక్‌పై వెళ్లాడు. తిరిగి వస్తుండగా మూడపల్లి శివారులోని నర్సింగాపూర్ క్రాస్‌రోడ్డు వద్ద వాహనం అదుపుతప్పి, మైలురాయిపై ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాయికుమార్ తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో వేములవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతని పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ పేర్కొన్నారు.

కోర్టు కేసు ముగిస్తే తిరిగి దుబాయ్‌కి..

కోర్టులో కేసు ముగిస్తే సాయికుమార్ తిరిగి దుబాయ్ వెళ్లేవాడు. కానీ, అనుకోకుండా రోడ్డు ప్రమాదంలో మృతి చెందడటంతో అతని కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడికి ఒక అక్క, చెల్లి ఉన్నారు. ఏకైక కుమారుడు చనిపోవడంతో ఆ తల్లిదండ్రులు తమకు దిక్కెవరంటూ రోదించిన తీరు స్థానికులను కంటతడి పెట్టించింది.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

జగిత్యాలటౌన్: ఈ నెల 25వ తేదీ నుంచి 27 వరకు డీపీఎస్ స్కూల్ మియాపూర్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి జూనియర్ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌కు జగిత్యాల జిల్లా బాలబాలికల జట్లను ఎంపిక చేసినట్లు జిల్లా క్రీడా కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి మంగళవారం తెలిపారు. బాలుర జట్టులో మంజునాథ్, శ్రీచరణ్, అభినవ్, అఖిల్, రామ్‌చరణ్, ప్రీతం, రోహన్, బి.శ్రీచరణ్, రాహుల్, వర్షిత్, సాకేత్, సాయి శ్రీగ్నేశ్, బాలికల జట్టులో శరణ్య, వర్షిత, అక్షిత, సంజన, సహస్ర, అర్చన, సుధాన్వి, హారిక, పూజ, కీర్తన, సమీక్ష ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు. కార్యక్రమంలో పెటా జిల్లా అధ్యక్షుడు పడాల విశ్వప్రసాద్, నిరంజన్, రవికుమార్, కృష్ణప్రసాద్, అజయ్‌బాబు, వేణు, రాజ్‌కుమార్, శశి, మంగ, విజ్ఞాన్, శ్రీరాం, సామంత్, హరీశ్ పాల్గొన్నారు.